క్లుప్తంగా...

ఓయూలో సందడిగా ఫౌండేషన్ డే



వాక్‌ను ప్రారంభిస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫౌండేషన్ డే సందర్భంగా జరిగే 2కే వాక్, తక్ష్-2023, ఓపెన్ డే, ఠాగూర్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలతో క్యాంపస్‌లో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం తొలి రోజు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు కొనసాగిన 2కే వాక్ కార్యక్రమాన్ని వీసీ ప్రొ.రవిందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ముగిసిన 2కే వాక్ ముగింపు సందర్భంగా వీసీ ప్రొ.రవీందర్ ఓయూ ఫౌండేషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. ఇదిలా ఉండగా నేడు (25న) జరిగే తక్ష్-2023 కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఓపెన్ డేకు క్యాంపస్ కాలేజీలు, వివిధ విభాగాలతో పాటు అనుబంధ కళాశాలలు నిజాం, కోఠి మహిళ, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీలు ముస్తాబయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకుల తెరచి ఉంచుతారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొ.నవీన్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, ప్రొ.మంగు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, ఫిజికల్ డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ, కంట్రోలర్ ప్రొ.రాములు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో హీరో సుశాంత్ సందడి



సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో సినీనటుడు సుశాంత్ సందడి చేశారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సెంటినరీ సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళా ప్రతిభను వెలికితీయవచ్చని ఈ సందర్భంగా సుశాంత్ పేర్కొన్నారు. ఎంతో మంది సమ్మర్ క్యాంప్ లాంటి ప్రత్యేక శిబిరాల ద్వారా ఎన్నో రకాల కళల్లో నైపుణ్యం సాధించి మేటి స్థాయికి ఎదిగారని వారిని స్ఫూర్తిగా తీసుకుని చిన్నారులు తమ కళానైపుణ్యానికి పదును పెట్టుకోవాలన్నారు. మే 20 వరకు కొనసాగే ఈ శిబిరం ద్వారా వేసవి కార్నివాల్ మ్యూజిక్ ప్లే, వెస్ట్రన్ డ్యాన్స్ క్లాసెస్, కాలిగ్రఫీ, అబాకస్, వేద గణిత, పాకక్లాస్‌తో సహా అనేక రకాల సృజనాత్మక క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సమ్మర్ ప్రోగ్రాం హెడ్ అమృత చంద్రరాజు తెలిపారు. ఫుట్‌బాల్‌లో లైసెన్స్ హోల్డర్ అయిన శ్యామలం, రిలే ఒలంపిక్స్‌లో 2021లో భారతదేశ ప్రతినిధి అలెక్స్ ఆంటోనీ, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో బంగారు పతక విజేత రణదీప్‌ముఖర్జీ తదితరులతో ప్రత్యేక సెషన్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'డబుల్' పేరుతో డబ్బులు వసూల్

రూ. 9 లక్షలు కాజేసిన ఇద్దరి రిమాండ్



సాగర్



వెంకటాచారి

అడ్డగుట్ట: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన సాగర్(27), అంబేడ్కర్ నగర్‌కు చెందిన వెంకటాచారి(56) పరిచయస్తులు. అడ్డగుట్టకు చెందిన పలువురికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని రూ. 9 లక్షల వరకు డబ్బులు కాజేసి ఏడాదిగా మాయమాటలు చెబుతూ వస్తున్నారు. ఇటీవల డబ్బులిచ్చిన వారు సాగర్, వెంకటచారిని గట్టిగా నిలదీయగా అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో చేసేదేమి లేక బాధితులు పోలీసులను ఆశ్రయించగా ఆదివారం సాగర్, వెంకటచారిలను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన తప్పు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సారూ.. మాకు ఇళ్లు ఎప్పుడిస్తారూ!

- కస్తూర్బానగర్ బస్తీ ఇళ్ల కేటాయింపునకు వీడని గ్రహణం
- 12 ఏళ్ల నుంచి కొలిక్కిరాని సమస్య
- నాయకులు మారినా ప్రజలకు తప్పని తిప్పలు
- ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల చుట్టూ జనం ప్రదక్షిణలు



కస్తూర్బానగర్ బస్తీ

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ రాణిగంజ్ బస్సు డిపో పక్కన ఉన్న రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కస్తూర్బానగర్ బస్తీ ఇళ్ల సమస్యకు మోక్షం లభించక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. సమస్య పరిష్కారం కోసం బస్తీ ప్రజలు ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోతుంది. అధికారుల నిర్లక్ష్యం..ప్రజాప్రతినిధుల నిర్లిప్తత ప్రజలకు గుదిబండగా మారుతుంది. సమస్యను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు నేడు రేపూ అంటూ కాలం వెళ్లదీస్తుండటంతో కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించే జనం పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. నిలువనీడ లేక సొంత గూడు కోసం ఏళ్ల బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో జనం ఎదురు చూస్తున్నారు. కస్తూర్బానగర్ బస్తీలో సుమారు 120 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

22 ఇళ్లను కేటాయించాల్సి ఉంది..

2011లో కస్తూర్బానగర్‌లో జేఎన్‌ఎన్‌యూఆర్ కింద 104 ఇళ్లను నిర్మించారు. ప్రభుత్వం మారడంతో లబ్ధిదారుల కేటాయింపు ఆలస్యం కావడంతో పాటు ఆ సమస్యకు రాజకీయ రంగు పులుముకుంది. 2014లో బస్తీలో ఇళ్ల కేటాయింపునకు నాటి ఎమ్మెల్యే, నేటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శ్రీకారం చుట్టారు. 91 మంది లబ్ధిదారులను గుర్తించి 82 మందికి ఇళ్లు కేటాయించారు. స్థానికేతరులంటూ మరో 13 మందిని పక్కన పెట్టారు. అదే విధంగా మరో 9 మందికి కూడా పొజిషన్ సర్టిఫికెట్ సైతం ఇవ్వలేదు. బస్తీలో ఇళ్ల కేటాయింపు సమస్యను సకాలంలో రెవెన్యూ, హౌజింగ్ విభాగం అధికారులు పరిష్కరించకుండా నాన్చుతూ వచ్చారు. దీంతో లబ్ధిదారులు అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం 22 ఇళ్లను కేటాయించాల్సి ఉంది. అయితే ఈ సమస్య ఏళ్ల తరబడి నుంచి ఇలాగే కొనసాగుతుంది. కట్టిన ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో కర్రె ఉన్నవాడిదే బర్రె అనే చందంగా పలువురు తాళాలు పగులగొట్టి బలవంతంగా నివాసముంటున్నారు.

మంత్రి వైపు జనం చూపు..

స్థానిక నాయకుల స్వార్థ, సంకుచిత, రాజకీయ నిర్ణయాల కారణంగా ఇళ్ల కేటాయింపు సమస్య ఓ కొలిక్కి రాకుండా ఐకాస్టంలా కాలుతుందని పలువురు స్థానికులు సాక్షితో వాపోయారు. స్థానిక నాయకులు డబ్బులు కోసం పలువురు లబ్ధిదారులను వేధింపులకు సైతం గురి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కస్తూర్బానగర్ బస్తీ ఇళ్ల కేటాయింపు సమస్య పరిష్కారానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి నిజమైన లబ్ధిదారులను గుర్తించి వెంటనే ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏళ్ల తరబడి నుంచి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో తాము అద్దె ఇళ్లలో కిరాయిలు చెల్లించలేక అనేక అవస్థలు పడుతూ దుర్భర జీవితాలను గడుపుతున్నామని పలువురు వాపోతున్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



వేసవి శిబిరాలను ప్రారంభిస్తున్న జయకర్ డేనియల్

రాంగోపాల్‌పేట్: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జయకర్ డేనియల్ అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని మాజీ అధ్యక్షులు రాబర్ట్ సూర్యప్రకాశ్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత వందేళ్ల నుంచి వైఎంసీఏ క్రీడల్లో శిక్షణ అందిస్తూ ఎంతో మంది అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసిందని గుర్తు చేశారు. నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో వేసవిలో పిల్లలకు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, ఎరోబిక్స్, డ్రాయింగ్, పెయింటింగ్, కీ బోర్డు, ఫోక్ డ్యాన్స్, భరతనాట్యం, తైక్వాండో, కుంగ్‌ఫూ, తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్ మైరిస్ ప్రతినిధులు జేమ్స్ కెన్నెత్, సంపత్, కల్యాణ్, అజేత పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం



అధికారులతో కలిసి బొల్లారం క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఖేలో ఇండియా' పిలుపు మేరకు కంటోన్మెంట్‌లోనూ క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన బోర్డు అధికారులతో కలిసి బొల్లారం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మైదానంలో కల్పించాల్సిన మౌలిక వసతులు, క్రీడా సామగ్రి తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో తొలిసారిగా సమ్మర్ క్రీడా క్యాంపులు నిర్వహిస్తున్నామని మడ్‌ఫోర్ట్, బొల్లారం, తిరుమలగిరి మైదానాల్లో సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్‌తో పాటు ఫిట్‌నెస్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆధునిక జీవన విధానంలో ఎలక్ట్రానిక్స్ గ్యాడ్జెట్ల వినియోగం ఎక్కువై, చిన్నారులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తి తగ్గుతోందని ఈ నేపథ్యంలోనే ప్రధాన మంత్రి ఖేలో ఇండియా పేరిట దేశ వ్యాప్తంగా క్రీడలకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు అధికారులు మహేందర్, పుష్పేందర్ గుప్తా, అసుతోష్ చౌహాన్, బీజేపీ నేతలు కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బౌద్ధనగర్: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ పేర్కొన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆమె జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఎంటమాలజీ, ఎలక్ట్రికల్ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రియాంక, శ్రీనివాస్, రాజు, చంద్రశేఖర్, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు పే స్కేల్ అమలు చేయాలి

లాలాపేట: తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులకు 30 శాతం తగ్గకుండా పే స్కేల్ అమలు చేయాలని టీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం తార్నాకలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల బేసిక్ పే అటెండర్‌కు రూ.10,880 ఉండగా పక్క రాష్ట్రం ఏపీలో అదే అటెండర్‌కు రూ 20 వేలు బేసిక్ పే ఉందన్నారు. తెలంగాణలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ స్వామి, సురేఖ, రవికుమార్, రవీందర్, స్వామి, జనార్దన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

సనత్‌నగర్: గుర్తుతెలియని ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ వివరాల ప్రకారం..ఫతేనగర్ సమీపంలోని పైప్‌లైన్ రోడ్డులో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండడంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సనత్‌నగర్ పోలీసులు బాధితుడిని హుటాహుటిన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు..

సికింద్రాబాద్: అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం. 4లోని హైదరాబాద్ ఎండ్ వద్దనున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మెట్ల పక్కన సోమవారం ఉదయం సుమారు 70–75 వయస్సున్న వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు దగ్గరకి వెళ్లి చూడగా మృత చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని..

పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్(53) కూలిపని చేస్తుంటాడు. ఈ నెల 24న మధ్యాహ్నం సఫిల్‌గూడ -ఆర్‌కేపురం రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



ఫ్లాష్‌మాబ్.. ఫుల్‌జోష్

ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ విద్యార్థుల సమక్షంలో మూడ్రోజుల టెక్నోస్మానియా–2023 3కే రన్, బైక్‌ర్యాలీ, ఫ్లాష్‌మాబ్‌తో ఉల్లాసంగా ప్రారంభమైంది. సోమవారం కాలేజీలోని కెమికల్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ, ఫార్మసీ విభాగాల విద్యార్థుల ఆధ్వర్యంలో 3కే రన్, బైక్ ర్యాలీలను ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, పూర్వ విద్యార్థి అసోసియేషన్ మెంబర్ సీపీ రాములు జెండాఊపి ప్రారంభించారు. అనంతరం లేడీస్ హాస్టల్ ఎదుట నిర్వహించి ఫ్లాష్‌మాబ్ (గ్రూప్‌డాన్స్)లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. –ఉస్మానియా యూనివర్సిటీ

ఈఎస్‌ఐ శ్మశాన వాటికను సుందరీకరిస్తాం



శ్మశాన వాటిక వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఈఎస్‌ఐ శ్మశాన వాటికను రూ.10 కోట్ల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, సీఈ జియాఉద్దీన్‌తో కలిసి శ్మశాన వాటికను సందర్శించి వాటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ శ్మశానవాటికకు సనత్‌నగర్‌తో పాటు కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాల నుంచి అంత్యక్రియలు నిర్వహించేందుకు వస్తుంటారన్నారు. శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ శ్మశాన వాటికను అత్యంత సుందరంగా నిర్మిస్తామన్నారు. అంత్యక్రియలు నిర్వహించే వేదికలు, అస్తికలను భద్రపరిచేలా లాకర్లు, వచ్చే వారి కోసం ప్రత్యేక భవనాలు, టాయిలెట్స్, వాహనాల పార్కింగ్, పనిచేసే సిబ్బందికి నివాస గృహాల నిర్మాణాలు చేస్తామని వెల్లడించారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అధికారులు మోహన్‌రెడ్డి, ఇందిర, హరి శంకర్, భార్గవ్, నాయకులు బాల్‌రెడ్డి, హనుమంత్‌రావు, బలరాం, నర్సింహ,ఎస్. శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్‌లో మంత్రి పర్యటన..

అమీర్‌పేట దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తానని మంత్రి తలసాని హామీ ఇచ్చారు. ఇటీవల స్థానిక మహిళలు మంత్రిని కలిసి నాలాలో నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోందని వివరించగా సోమవారం మంత్రి నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, జలమండలి ఎండీ దాన కిషోర్‌తో కలిసి అపార్ట్‌మెంట్స్‌లో పర్యటించారు. సమీపంలోని నాలాను పరిశీలించి వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్‌ఎన్‌డీపీ సీఈ జియా ఉద్దిన్, రవికిరణ్, కృష్ణ,మోహన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్, బీఆర్‌ఎస్ నాయకులు శ్యాంసుందర్, సునీత పాల్గొన్నారు.

పిల్లలకు విలువలు నేర్పించాలి



మల్లికార్జునను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాంగోపాల్‌పేట్: తమ పిల్లలకు తల్లిదండ్రులు విలువలు నేర్పించి సమాజంలో ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలని కళాసీగూడ హెచ్‌ఎం నారాయణ అన్నారు. సోమవారం పాఠశాలలో చివరి పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. వేసవిలో విద్యార్థులు సమయం వృథా చేయకుండా చెస్, వేదిక్ మ్యాథ్స్, ఇంగ్లిష్ గ్రామర్ వాటిలో శిక్షణ అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అత్యుత్తమ విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు కల్పించిందని సూచించారు. ఈ ఏడాది నూతన విద్యా సంవత్సరంలో ప్రతి పేరెంట్ ఐదుగురు కొత్త విద్యార్థులను చేర్పించాలని ఆయన కోరారు. ఈ ఏడాది బెస్ట్ పేరెంట్‌గా మల్లికార్జునను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలతి, శైలేంద్ర, రమేష్‌గౌడ్ తదితరులు అన్నారు.

సివరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ వేంకటేశ్వర నగర్‌లో నూతన సివరేజీ పైప్‌లైన్ పనులను సోమవారం కార్పొరేటర్ సామల హేమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో మురుగునీటి సమస్యలు పరిష్కరించేందుకు రూ.18 లక్షల వ్యయంతో 250 ఎంఎం పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. తాగునీరు సరఫరా వేళల్లో సంబంధిత సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, లోప్రెషర్ సమస్య ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్పొరేటర్ వెంట జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ మేనేజర్ నవ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



పైప్‌లైన్ పనులు ప్రారంభించిన హేమ

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



బీఆర్‌ఎస్ నేతలతో సమావేశమైన మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో సోమవారం ఆయన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సమావేశానికి తరలి రావాలన్నారు. నిరంతర విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుభీమా, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశవ్యాప్తంగా అందించాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఓ పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో పరిపాలన సాగుతోందన్నారు. గులాబీ దండు బలం, బలగం చాటాలన్నారు. కంటోన్మెంట్‌లోనూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కంటోన్మెంట్‌లో ఈ సారి 50 వేల మెజార్టీతో గెలుస్తామని.. బీఆర్‌ఎస్ పార్టీని నియోజకవర్గ ప్రజలు నిండుగా దీవిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్, ఎంఎస్ ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, లాస్య, నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం

సనత్‌నగర్: అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టేందుకు వెనుకాడేది లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌లోని గురుమూర్తిలేన్‌లో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరితో కలిసి ప్రారంభించారు. అనంతరం అత్యాధునిక సదుపాయాలతో నిర్మితమవుతున్న బేగంపేట శ్మశానవాటిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. త్వరలోనే శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో బేగంపేటవాసుల కల నెరవేర్చగలిగామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామగ్రామాన వైకుంఠధామాలు ఏర్పాటు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గం కొన్ని వందల కోట్లతో అభివృద్ధి చేశామని గత పాలకులు ఏమాత్రం పట్టించుకోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామన్నారు.



శ్మశానవాటిక పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బీసీ వ్యతిరేకి బీజేపీని సాగనంపుదాం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

రాంగోపాల్‌పేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ కుల జనగణన చేపట్టకుండా బీసీ వ్యతిరేఖ ధోరణి అవలంభిస్తుందని సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ ఆరోపించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల జనగణన చేపట్టని బీజేపీ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లు తొలగించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందిస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత కొన్ని నెలలుగా ప్రగతిశీల పార్టీలు బీసీ కుల గణన కోసం పోరాటాలు చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇది సాధ్యం కాదని కుల విభజనకు దారి తీస్తుందని సుప్రీం కోర్టుకు లేఖ రాసిందన్నారు. దేశ జనాభాలో 50 శాతం పైబడ్డ ఉత్పత్తి కులాలకు సంబంధించిన హక్కులు, అధికారాలను కాలరాస్తూ శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం వేగవంతం చేసిందని విమర్శించారు. నూతన విద్యా విధానం పేరుతో దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమే కాకుండా భారత రాజ్యాంగం కల్పించిన చదువుకునే హక్కును కాలరాసే కుట్రలను బీజేపీ ప్రభుత్వం పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, కల్యాణ్, పవన్ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో వర్గపోరు

ఒక వర్గం జెండా దిమ్మె ఏర్పాటు, మరో వర్గం కూల్చివేత

రసూల్‌పురా: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతకాలు ఎగురవేసేందుకు ఏర్పాటు చేస్తున్న జెండా దిమ్మెల విషయంలో పార్టీ నేతల మధ్య వర్గపోరు మొదలైంది. ఓ వర్గం కట్టిన జెండా దిమ్మెను మరో వర్గం కూల్చివేశారు. అందుకు సంబంధించిన వివరాలిలా.. దివంగత సాయన్న వర్గానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని లాల్‌బజార్ బస్టాప్, లాలమీయా బస్తీ, గన్‌రాక టీచర్స్ కాలనీ, చిన్న కమేళా కల్లు కాంపౌండ్ సమీపంలో జెండా దిమ్మెలను కట్టి గులాబీ రాడ్లను ఏర్పాటు చేశారు. చిన్న కమేలా కల్లు కాంపౌండ్ వద్ద తన స్థలంలో జెండా దిమ్మెను కట్టొద్దని బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేసి కడితే కూల్చి వేస్తానని ఫోన్ ద్వారా హెచ్చరించాడు. అయినా జెండా దిమ్మెను ఏర్పాటు చేశారు. కాసేపటి తర్వాత జెండా దిమ్మెను కూల్చివేసి రాడ్‌ను పక్కకు బెట్టారని సరితకు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ.. స్వయంగా బోర్డు మాజీ సభ్యురాలు, శ్యామ్‌కుమార్ సతీమణి భాగ్యశ్రీ వచ్చి జెండా రాడ్‌ను తొలగించి దిమ్మెను కూల్చివేసిందని ఆరోపించారు. పార్టీ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను జెండాలను ఎగురవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నానని వార్డు పరిధిలో శ్యామ్ ఆగడాలపై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తానన్నారు.



జెండా దిమ్మె ఏర్పాటు చేస్తున్న దృశ్యం



కాసేపటి తర్వాత కూల్చివేశారిలా..